క్లుప్తంగా

నేడు రేబిస్ డ్రైవ్



మహేశ్వరం: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీలో శుక్రవారం సామూహిక రేబిస్ టీకా డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. బ్లూక్రాస్ ఎన్జీఓ, మిషన్ రేబీస్, వరల్డ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు షాహీన్‌నగర్ ఫ్రైడే మార్కెట్ స్థలంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. రేబిస్ కారణంగా మానవ మరణాలు సంభవించరాదన్న ఉద్దేశంతో మున్సిపాలిటీని రేబిస్ రహిత జోన్‌గా మార్చడానికి ప్రయత్నిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సేవకులు.. వీధి కుక్కలు, పెంపుడు శునకాలను తీసుకొచ్చి టీకా వేయించాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, మున్సిపల్ కమిషనర్

కందుకూరు: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వరూప అన్నారు. మండల పరిధి లేమూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషన్ అభియాన్–2024లో భాగంగా పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు 6 నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలనే తాగించాలని, రెండేళ్ల వరకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీడీఓ సరిత మాట్లాడుతూ.. పోషకాలతో పాటు సీజన్‌లో వచ్చే ప్రతి పండు తినాలని చెప్పారు. బయటి ఆహారాన్ని తీసుకోవద్దన్నారు. అంగన్‌వాడీల్లో అందజేసే గుడ్లు, పాలు శరీరానికి అవసరమైన పోషకాలు ఇస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడలో వైద్య శిబిరం



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కందుకూరు: మండల పరిధి కొత్తగూడలో కందుకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీందర్, సూపర్‌వైజర్లు అర్చన, రఘురామ్, ఆశ వర్కర్లు అనిత, యాదమ్మ, రేణుక, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని జన్మదిన వేడుకలు

కందుకూరు: దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, సయ్యద్ అజీజ్, సభావత్ లచ్చానాయక్, ఎస్.రాంరెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.జగదీష్, జి.సుధాకర్‌రెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో అసోసియేషన్ సభ్యులు

కందుకూరు: వాటర్‌మెన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బండి సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా మాదారం అనిల్, కార్యదర్శిగా నల్ల కిషన్, సంయుక్త కార్యదర్శిగా బాలరాజ్, కోశాధికారిగా పెంటయ్య, సహాయ కార్యదర్శులుగా ఆర్.భిక్షపతిలను నియమించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

చైతన్యపురి: ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని దిల్‌సుఖ్‌నగర్ సిటీడిపో మేనేజర్ టి.సమత అన్నారు. ఆగస్టు నెలలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి గురువారం డిపోలో జరిగిన కార్యక్రమంలో డీఎం క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

‘విశ్వాసం’ చూపని నేస్తం!

- కుక్కకాటుతో ప్రజల బెంబేలు
- దూరంగా ఉండటమే మంచిదంటున్న వైనం
- ఆదరిస్తే.. ప్రమాదం లేదంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం



మహేశ్వరం: కుక్క కాటు సంఘటనలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. విశ్వాసం గల జంతువుగా గుర్తింపు పొందిన శునకాలు.. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ బాటసారులపై అకారణంగా దాడులు చేస్తూ.. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. పెంపుడు కుక్కలు సైతం కరుస్తుండటంతో వాటికి దూరంగా ఉండటమే మంచిదని కొందరు జంతు ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు. వీటి నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వాటి ఆగడాలు నానాటికీ పెరుగుతుండటంతో కుక్కలతో నేస్తం మంచిది కాదని, ఎప్పుడు ఎలా ఉంటుందోనని చాలామంది వాటికి దూరంగా ఉంటున్నారు. కానీ.. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదని వెటర్నరీ వైద్యులు వెల్లడించారు. ప్రపంచ రెబీస్ డే సందర్భంగా సమగ్ర కథనం.

జాగ్రత్తలు..

ఏ జాతీ కుక్కలకైనా ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా వ్యాక్సి నేషన్, నట్టల మందులను వేయించాలి. వ్యాక్సిన్ ఇప్పించనట్లయితే.. ఆరు నుంచి తొమ్మిది రకాల ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ప్రతి శునకానికి 9 ఇన్ 1, 8 ఇన్ 1, 7 ఇన్ 1 అనే వ్యాక్సిన్ చేయించాలి. కుక్క కాటు నుంచి ప్రజలకు వ్యాధులు రాకుండా ఉండేందుకు శునకాలకు ఏడాదికి ఒకసారి యాంటీ రేబిస్ వేయించాలి.

కుక్క కాటుకు వైద్యం

కుక్క కాటు బాధితులు.. కరిచిన రోజు నుంచి 0,3,7,14,28,60 రోజుల్లో ర్యాబిపర్ వ్యాక్సినేషన్ చేయించుకోవాలి. కరిచిన శరీర భాగం వద్ద ఇమ్యూనో గ్లోబులెన్స్‌ను తీసుకోవాలి. ఇది మనిషి బరువుకు తగ్గ డోస్ ఇస్తారు. గ్లోబులెన్స్ కోసం నారాయణగూడలోని ఐపీఎం(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్)లో సంప్రదిస్తే ఉచితంగా ఇస్తారు. ఒకవేళ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వని పెంపుడు కుక్క తోటి జంతువుతో కాటుకు గురైనట్లయితే.. దానికి కూడా మనుషుల మాదిరిగానే ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది.

నట్టల మందుతో నివారణ

పుట్టినప్పటి నుంచి మూడు నెలల వరకు కుక్క పిల్లలకు ప్రతి 15 రోజులకు ఒకసారి నట్టల మందులను వేయాల్సి ఉంటుంది. మూడు నెలల నుంచి ఆరు నెలల వయసు కలిగిన వాటికి నెలకు ఒకసారి, ఆరు నెలల పైబడిన వయసు గల కుక్కలకు ఏడాదికి నాలుగు పర్యాయాలు మందులు వేయాల్సి ఉంటుంది. చిన్న వాటిల్లో నట్టలకు సంబంధించి హైడాటిడ్ సిస్ట్ వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. వాటి నుంచి మనుషులకు రేబిస్, లెప్టోస్పైరా తదితర వ్యాధులు సోకే అవకాశాలున్నాయి.

కుక్కలకు ప్రమాదం..

బాహ్య పరాన్న జీవులతో కుక్కలకు ప్రమాదం పొంచిఉంది. గోమార్లు, పేళ్లు వాటి శరీరంపై వాలి రక్తాన్ని పీల్చుతాయి. వీటి ద్వారా శునకాలకు ఏర్ క్రియోసిస్, ట్రిపినో జొమియాసిస్, బేబీ సియోసిస్, టిక్ ఫీవర్ లాంటివి వచ్చే అవకాశం ఉంది. వీటి నిర్మూలనకు కుక్కలకు పక్షం రోజులకు ఒకసారి యాంటి టిక్ షాంపో, ప్రత్యేక సబ్బులతో స్నానం చేయించాలి. వర్షాకాలం అనంతరం కుక్కలకు వ్యాధులు సోకుతాయి. జలుబు చేసినట్లయితే వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

వర్షాకాలంలో జాగ్రత్త



వీధి కుక్క కాటు కేసులు పెరుగుతున్నాయి. శునకాలతో ఎలా ఉండాలో పిల్లలకు చెప్పాలి. వాటిని రాయి, కర్రలతో కొడితే కరిచే ప్రమాదం ఉంది. అలాంటి ఘటనలు ఇటీవల ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వాటిని ప్రేమగా చూసుకుంటూ.. తగిన సౌకర్యాలు కల్పించినట్లయితే.. ఎలాంటి ప్రమాదం ఉండదు. వర్షాకాలం ప్రారంభం నుంచే వాటితో జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జియన్

నడవటానికీ ఇబ్బందే

రోడ్డుకు మరమ్మతులు చేయించరూ..



మామిడిపల్లి రహదారి దుస్థితి

మహేశ్వరం: ‘రోడ్డంతా అధ్వానంగా మారింది. వానొస్తే బురద మయమే. నడవటానికి కూడా ఇబ్బందిగా ఉంది. మరమ్మతులు చేయించండి’ అని స్థానికులు కోరారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 11వ డివిజన్ మామిడిపల్లి గ్రామం వివేకానంద కాలనీ రోడ్డును గంతలో తవ్వి డ్రైనేజీ పైపులైన్ వేశారు. అనంతరం మట్టితో పూడ్చారు. దీంతో రోడ్డంతా గోతులు ఏర్పడ్డాయి. కురుస్తున్న వర్షాలకు రహదారి మొత్తం బురదమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సీసీరోడ్డు వేయాలని కోరుతున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: చదవుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జోనల్ స్థాయి క్రీడలను గురువారం పట్నం గురుకుల విద్యాపీఠ్‌లో స్థానిక చైర్‌పర్సన్ స్రవంతి ప్రారంభించారు. విజేతలకు నిరంజన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ క్రీడోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ స్థాయి టోర్నీని తొలిమెట్టుగా భావించి, ఆటల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెన్న కేశవరెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, పీఈటీలు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహేశ్వరం: పై కప్పు లేని మ్యాన్‌హోల్ గురించి ‘పొంచి ఉన్న ప్రమాదం’ శీర్షికన ఈ నెల 25న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. కమిషనర్ వాణి రెడ్డి ఆదేశాలతో సిబ్బంది గురువారం శ్రీరాం కాలనీ బస్టాప్ వద్ద మ్యాన్‌హోల్‌ను ఇటుకలతో పునర్నిర్మించి, పైకప్పును ఏర్పాటు చేశారు. పనులను 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీని పరిశీలిస్తున్న అధికారులు, స్థానిక నాయకులు

కడ్తాల్: ఎట్టకేలకు సైడ్ డ్రైన్ డ్రైనేజీ మరమ్మతు పనులను గురువారం నేషనల్ హైవే అధికారులు ప్రారంభించారు. మండల కేంద్రంలోని తలకొండపల్లి కూడలిలో శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై వర్షం నీరు వెళ్లేందుకు నిర్మించిన పైపులైను.. మూడు నెలల క్రితం కుంగిన విషయం తెలిసిందే. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల చొరవతో పనులు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రెసిడెంట్ ఇంజినీర్ గంగాధర్, బ్రిడ్జి ఇంజినీర్ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోలర్ వేణు, సైట్ ఇంజినీర్ భట్టాచార్య లోకల్ ఇన్‌చార్జి రవీందర్ తదితరులు డ్రైనేజీని పరిశీలించి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఐదారు రోజుల్లో పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు మల్లేశ్‌గౌడ్, అశోక్, రాజేశ్, శ్రీకాంత్ ఉన్నారు.



హుడాకాంప్లెక్స్: ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు బాలకిషన్, మహేందర్ యాదవ్ తదితరులు



కందుకూరు: చౌరస్తాలో.. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తదితరులు

ఘనంగా ఐలమ్మ జయంతి

‘వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తికి ప్రతీక. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ మనందరికీ ఆదర్శం’ అని పలువురు నాయకులు అన్నారు. గురువారం ధీర వనిత జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆమె విగ్రహాలు, చిత్ర పటాలకు రాజకీయ, రజక సంఘం నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమ కోసం పాటుపడిన మహనీయురాలని, ఉద్యమాల్లో మహిళల పాత్ర అసమానమైనదని చాటి చెప్పిన యోధురాలు అని కొనియాడారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు.

–సాక్షి,నెట్‌వర్క్



కందుకూరు: గూడూరులో..



కందుకూరు: నేదునూరులో..

ఏటేటా మునక!

- ముంపునకు గురవుతున్న శారదానగర్
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న కాలనీవాసులు
- విస్మరిస్తున్న పాలకులు, అధికారులు

వనస్థలిపురం: వర్షాకాలం వచ్చిన ప్రతి సారీ ఆ కాలనీవాసులకు ఆందోళన తప్పడం లేదు. ఎగువనున్న కాలనీలు, పొలాల నుంచి వచ్చే మురుగు నీటికి తోడు వరదనీరు చేరి కాలనీని ముంచెత్తుతోంది. ప్రతి యేడు ఇదే గోస పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద పారిన మొదటి రోజు మాత్రమే వచ్చి ఆదుకుంటాం.. శాశ్వత పరిష్కారం చూపుతామంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని వాపోతున్నారు.

వరద కాలువ లేక..

హయత్‌నగర్ డివిజన్ పరిధిలో 1500 ఇళ్లతో అతి పెద్ద కాలనీ శారదానగర్ కాలనీ. ఫేజ్–3 (మోహినీ ఎన్‌క్లేవ్)లో 200లకు పైగా ఇళ్లు ఉంటాయి. కాగా కాలనీకి ఎగువన ఉన్న సాహెబ్‌నగర్, పద్మావతి కాలనీ, పీవీఆర్ కాలనీ, సామనగర్, ఆంధ్రకేసరినగర్, కమలానగర్, భూలక్ష్మీనగర్, సుభద్రానగర్ తదితర కాలనీల నుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్ ఫేజ్–3 మీదుగా హయత్‌నగర్ కుమ్మరికుంట, బాతుల చెరువు ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే సరైన వరద కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్‌ను ముంచెత్తుతోంది. వర్షాలు కురిస్తే ఖాళీ స్థలాలు కుంటలను తలపిస్తాయి. కాలనీ ఎగువన ఉన్న పొలాలు, దిగువన ఉన్న ప్రాంతంలో నాలా అధ్వాన్నస్థితిలో ఉండడంతో దుర్వాసన, దోమలు, పాములతో సహజీవనం చేయాల్సిన వస్తోందని వాపోతున్నారు.

నిధులు మంజూరైనా..

శారదానగర్ నుంచి దిగువన ఉన్న నర్సింహారావునగర్ వరకు వరద కాలువ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ నుంచి 2021లో రూ. 58 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 2021 సెప్టెంబరు 22న పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయినా వివిధ కారణాలతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇచ్చినా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

వరద కాలువను నిర్మించాలి..



వర్షాకాలంలో శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ చాలా ఏళ్లు గా వరద ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువ నిర్మాణం పనులకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలంలో నానా ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓపెన్ నాలాతో దుర్వాసనతో పాటు, పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయంలో ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులు స్పందించి వరద కాలువను నిర్మించాలి.

–కే.ఎల్.నర్సింహారావు, శారదానగర్ ప్రధాన కార్యదర్శి



కాలనీలో పారుతున్న వరద



ఎగువన ఉన్న పొలాల నుంచి కాలనీలోకి వస్తున్న మురుగు నీరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

తుక్కుగూడ: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. రావిర్యాల జెడ్పీహెచ్ఎస్‌లో 2004– 05 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న బాల్య మిత్రులు.. రెండు దశాబ్దాల అనంతరం గురువారం ఓకే వేదికగా సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయాలి

ఎల్బీనగర్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన ఛలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షులు కానుగుల అరుణ్ కోరారు. ఈ నెల 27న ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహసభలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



రైతు బజారు వద్ద పూలు, పండ్ల షెడ్లను తొలగిస్తున్న సిబ్బంది

ధర్నాకు దిగిన చిరు వ్యాపారులు

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు కూడలి వద్ద రోడ్డు ఆక్రమణల తొలగింపును టౌన్ ప్లానింగ్ అధికారులు రెండవ రోజూ కొనసాగించారు. రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలనే కాకుండా రైతు బజారు ప్రహరీకి ఆనుకుని ఉన్న షెడ్లను సైతం గురువారం తొలగించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు ఆందోళనకు దిగారు. కేవలం మమ్మల్ని టార్గెట్ చేసుకుని తమ షెడ్లను తొలగించారని, జలమండలి కార్యాలయానికి ఆనుకుని ఉన్న దుకాణాలు, సంపూర్ణ థియేటర్ పక్కన షాపుల వారి ఆక్రమణలను ఎందుకు తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడాబాబులకు ఓ న్యాయం, మాకు ఓ న్యాయమా.. అంటూ అధికారులపై మండిపడ్డారు. మార్పు రావాలని కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే తమ ఉపాధిని పోగొట్టారని ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పూలు, పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నామని, ఒక్కసారిగా తమ వ్యాపారాలను కూల్చేస్తే తాము ఎలా బతకాలని పలువురు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి తమకు ఉపాధి కల్పించాలని కోరారు.



ఆందోళన నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు